# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **స్వర్ణాంధ్ర సాధన కోసం ప్రజలు సూచనలు, సలహాలు అందజేయాలని ముఖ్య మంత్రి ఎన్. చంద్ర బాబు నాయుడు సూచించారు.**
2. **రానున్న దసరా, దీపావళి, ఛత్ పండుగల సందర్భంగా ప్రయాణీకుల సౌకర్యార్థం ఆరు వేల ప్రత్యేక రైళ్ళను నడపనున్నట్టు రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలిపారు.**
3. **శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ కల్తీ అంశంపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఈరోజు తిరుమలలో విచారణ చేపడుతోంది.**
4. **ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ వైష్ణవ క్షేత్రం అహోబిలం... ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపికైంది..**
5. **ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, విప్లవ యోధుడు సర్దార్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా దేశ ప్రజలు ఆయనకు నివాళులు అర్పిస్తున్నారు.**

============================

స్వర్ణాంధ్ర సాధన కోసం ప్రజలు సూచనలు ..., సలహాలు అందజేయాలని ముఖ్య మంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు పిలుపు నిచ్చారు. ఈ విషయాన్ని ఈరోజు ఆయన ఎక్స్ లో పేర్కొంటూ ...... వచ్చే 2047 సంవత్సరం నాటికి ఆంధ్ర ప్రదేశ్ మెరుగైన వృద్ధి రేటు సాధించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధన కోసం ప్రజలు తమ అభిప్రాయాలు ...., సూచనలు అంద జేసి ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. swarnandhra.ap.gov.inకు ప్రజలు సూచనలు...., సలహాలు అందజేసి అభినందనలతో ఇ – సర్టిఫికెట్ అందుకోవాలని కోరారు. ప్రజలు ఇచ్చే ప్రతి సూచనను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు చంద్ర బాబు నాయుడు సూచించారు.

--------------------------

దేశ వ్యాప్తంగా అధిక సంఖ్యలో మెక్కలు నాటే కార్యక్రమం ఏక్ పేడ్ మా కే నామ్ కింద ఇప్పటివరకు 80 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు కేంద్ర పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ తెలిపింది. గడువుకు ఐదు రోజుల ముందు అంటే ఈ నెల 25వ తేదీనే 80 కోట్ల మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని సాధించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఏక్ పేడ్ మాకే నామ్ ప్రచారం అడవుల పెంపకంలో దేశవ్యాప్తంగా విజయాన్ని సాధించగా...సుమారు 26 కోట్ల మొక్కలు నాటడం ద్వారా ఉత్తరప్రదేశ్ ఈ కార్యక్రమంలో ముందుంది. ఏక్ పేడ్ మా కే నామ్ ప్రచారాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది జూన్ 5వ తేదీన ఢిల్లీలో ప్రారంభించారు.

---------------------------

రానున్న దసరా ..., దీపావళి ...., చత్ పండుగల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం దేశ వ్యాప్తంగా ఆరు వేల ప్రత్యేక రైళ్ళను నడపనున్నట్టు రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలిపారు.

ఢిల్లీలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ....పండుగల సందర్భంగా తమ స్వస్థలాలకు వెళ్ళే ప్రజల కోసం గత ఏడాది. 4 వేల 429 రైళ్ళను నడపగా, ఈ సారి 5 వేల 975 రైళ్ళను నడపనున్నామని చెప్పారు. మరొక 108 రైళ్లకు సాధారణ కోచ్ లను పెంచుతున్నామని .., దీంతో .... 12 వేల 5 వందల కోచ్ లు అందుబాటులోకి వస్తాయని ...., దీని వల్ల కోటి మందికిపైగా ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు సులువుగా చేరుకోవడానికి వీలవుతుందని అశ్విన్ వైష్ణవ్ పేర్కొన్నారు.

---------------------------

తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందన్న అంశంపై దర్యాప్తు జరిపేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ రోజు తిరుపతి...., తిరుమలలో విచారణ చేపడుతోంది. సర్వ శ్రేష్ఠ త్రిపాఠి నేతృత్వంలోని ఈ బృందం మొదట తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులతో సమావేశమవుతుంది.

---------------------------

రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టు ....P.S.P .ల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన విద్యుత్ ఉత్పత్తి సంస్థ ......A.P. GENCO ...,. నేషనల్ హైడ్రో ఎలెక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్‌ల మధ్య భాగస్వామ్య ఒప్పందాలు జరిగాయి. వెలగపూడి సచివాలయంలో ముఖ్య మంత్రి ఎన్. చంద్ర బాబు నాయుడు సమక్షంలో నిన్న కుదిరిన ఈ ఒప్పందం కింద లక్ష కోట్ల రూపాయల మేర పెట్టుబడులు రానున్నాయి. ప్రతిపాదిత విద్యుత్ ప్రాజెక్టులను రెండు దశలలో పూర్తి చేయనున్నారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రముఖ వైష్ణవ క్షేత్రం అహోబిలం ... ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపికైంది. 2024 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఉత్తమ పర్యాటక గ్రామాల పోటీలో 8 విభాగాలలో కేంద్ర పర్యాటక శాఖ 36 గ్రామాలను విజేతలుగా ప్రకటించింది. స్పిరిచువల్ వెల్ నెస్ విభాగంలో అహోబిలం క్షేత్రం విజేతగా నిలిచింది. ఢిల్లీలో నిన్న జరిగిన ఒక కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగ్ దీప్ ధంకడ్ .... సంబంధిత జిల్లా అధికారులకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

---------------------------

దేశం కోసం మరణించిన ..., జనం కోసం జీవించిన విప్లవ సేనాని ..., ధైర్య శాలి ..., త్యాగ శీలి సర్దార్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా దేశ ప్రజలు ఆయనకు ఈ రోజు ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు. 1907 వ సంవత్సరం సెప్టెంబర్ 28 వ తేదీన అప్పటి పంజాబ్ రాష్ట్రంలోని ఖత్కర్ కలాన్ గ్రామంలో జన్మించిన ఆ మహనీయుని .... తమపై తిరుగుబాటు చేసినందుకు 1931 వ సంవత్సరం మార్చి 23 వ తేదీన బ్రిటిష్ వారు ఉరి తీశారు. భారత దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధులలో భగత్ సింగ్ పేరు భారతీయుల మనో ఫలకంపై ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

---------------------------

ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా నరసరావు పేట పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో 700 కిలోమీటర్ల రహదారి నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు పార్లమెంటు సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు తెలిపారు. పీ.ఎం.జి. ఎస్.వై కింద 15.83 కోట్ల రూపాయలతో నిర్మించనున్న వినుకొండ మండలం కొత్తపాలెం నూజెండ్ల మండలం నాగిరెడ్డిపల్లి మధ్యలో గుండ్ల కమ్మ నదిపై హై లెవెల్ వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే జీవీ. ఆంజనేయులుతో కలిసి నిన్న పార్లమెంటు సభ్యులు శంకుస్థాపన చేశారు. వినుకొండ శాసనసభ నియోజకవర్గంలో 100 కిలోమీటర్లకు పైగా రోడ్ల నిర్మాణానికి అంచనాలు వేశారని, ఈ పథకం కింద కేంద్రం 60శాతం, రాష్ట్రం 40% నిధులతో పనులు చేపడతారని చెప్పారు.

---------------------------

దేశ వ్యాప్తంగా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా సెప్టెంబర్ నెలను పోషకాహార మాసంగా నిర్వహిస్తోంది. “జాతీయ పోషకాహార మిషన్” అని కూడా పిలిచే ఈ కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2018 మార్చి 18వ తేదీన ప్రారంభించారు. పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించి వారిని ఆరోగ్య వంతులుగా చేయడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. బాల బాలికల ఆరోగ్య పరిరక్షణకు ఈనెల 30వ తేదీ వరకు పలు కార్యక్రమాలు కొనసాగుతాయి. రక్తహీనత పెరుగుదల, పర్యవేక్షణ, పోషకాహారం వంటి అంశాలతో పోషన్ భీ -పడాయి భీ అనే నినాదంతో ఈ సంవత్సరం కార్యక్రమాలను అమలు చేస్తున్నారు.

కాగా.. పోషకాహార మాసోత్సవంపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అక్టోబర్ 1వతేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని శుద్ధి చేయనున్నట్లు టిటిడి ఆ ప్రకటనలో తెలిపింది. అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా అక్టోబర్ 1వ తేదీ బ్రేక్ దర్శనాలను రద్దు చేయనున్నట్లు టిటిడి ఆ ప్రకటనలో తెలిపింది. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని టిటిడి విజ్ఞప్తి చేస్తోంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన ఆలయాల్లో రాష్ట్ర పండుగలు జరుపుకునే ప్రత్యేక సందర్భాల్లో స్వామి, అమ్మవార్లకు సమర్పించే పట్టు వస్త్రాలను సంబంధిత జిల్లా సీనియర్ మంత్రి , దేవాదాయ శాఖ మంత్రి లేదా ఇన్ చార్జి మంత్రి సమర్పించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ తెలిపింది. పండుగల సందర్భంలో ఆలయాలలో పాటించవలసిన నిబంధనలకు సంబంధించి దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్. సత్యనారాయణ నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. పండుగల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సమన్వయం చేసుకోవాలని ..., ఖర్చును ఆయా శాఖలే భరించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

---------------------------

భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి. వై. చంద్ర చూడ్ ఈరోజు సాయంత్రం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే ఆయన తిరుమలకు చేరుకుంటారు. రేపు ఉదయం శ్రీ వేంకటేశ్వర

స్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన తిరుగు ప్రయాణమవుతారు.

---------------------------

ప్రకాశం జిల్లాలో పర్యటిస్తున్న జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాతోతు హుసేన్ ఈరోజు చీమకుర్తి మండలం గరికమిట్టలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు సమకూరుస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం .... చీమకుర్తిలో కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల భవనాన్ని పరిశీలించారు.

---------------------------

రాష్ట్రంలో ప్రభుత్వ ..., ఎయిడేడ్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాలలలో మాదిరిగానే ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వాలని ఇంటర్మీడియట్ విద్యా శాఖ సంచాలకురాలు కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన కార్డు నమూనాను అధికారులకు పంపించారు. వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు తెల్ల రంగు ..., ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వారికి లేత పసుపు రంగు ....., రెండవ సంవత్సరం వారికి లేత నీలం రంగు కార్డులను తయారు చేసి ఇవ్వాలని కృతీకా శుక్లా సూచించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 114వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఫలితంగా ఆంధ్ర ప్రదేశ్...., తెలంగాణా రాష్ట్రాల్లో ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు..., ఏలూరు..., చిత్తూరు ...., తిరుపతి జిల్లాలలో ఒక మోస్తరు వర్షాలు ...,.మిగతా జిల్లాలలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తు నిర్వహణా శాఖ తెలిపింది.

---------------------------

తిరుమల పవిత్రతను కాపాడడం ...., ఆగమ శాస్త్రాలు ...., సనాతన హైందవ ధర్మాన్ని పాటించడమే ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.డి.ఎ. కూటమి లక్ష్యమని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. నెల్లూరు పట్టణంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ .... తిరుమల ఆగమ శాస్త్రాన్ని ..., నియమ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేస్తామని పేర్కొన్నారు.

=====================